క్లుప్తంగా

విధులకు హాజరుకాని ఉద్యోగులు



యాటకల్లు సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామ సచివాయలంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలైనా ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. ఒక్క మహిళా పోలీసు యురేఖ తప్పా మిగతా వారు లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో తొగలుగల్లు, కలపరి, దొడగొండ గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరిగివెళ్లారు. సచివాలయంలో కుర్చీలు ఎక్కడపడితే ఆక్కడ పడిఉండడం, చెత్తచెదారంతో అపరిశుభ్రంగా ఉంది. ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామ సచివాలయం కావడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఉద్యోగులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని, సమయపాలన పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ రాణెమ్మ దృష్టికి తీసుకెళ్లగా సచివాలయం కార్యదర్శి సురేష్ పని మీద ఆస్పరి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారని, హాజరు కాని ఉద్యోగులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

సబ్‌స్టేషన్ తనిఖీ

గోనెగండ్ల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆ శాఖ ఎస్ఈ ఉమాపతి మంగళవారం తనిఖీ చేశారు. సబ్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరవుతున్నారా, లేదా అని ఏఈ సుధాకర్ రావును అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో లోపాల్లేకుండా చూసుకోవాలని సూచించారు.

అరుణాచలంకు ఆర్టీసీ బస్సు సర్వీసు

ఎమ్మిగనూరు టౌన్: పౌర్ణమి సందర్భంగా ఈనెల 31వ తేదీన అరుణాచలంకు స్థానిక ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ శనివారం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... రూ.2200 చార్జీతో అరుణాచలంతో పాటు మార్గమధ్యంలో కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్‌టెంపుల్ దర్శనం కూడా చేసుకోవచ్చన్నారు. బస్సులో 36 మంది ప్రయాణించవచ్చని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కృష్ణగిరి: నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ విశ్వమోహన్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో హౌసింగ్ ఏఈ షేక్షావలి, సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విద్యాశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 587 ఇళ్లు మంజూరుకాగా ఇప్పటివరకు 219 మాత్రమే పూర్తయ్యాయన్నారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని సూచించారు.

గ్రామ సేవకురాలు మృతి



లక్ష్మిదేవి (ఫైల్)

కృష్ణగిరి: మండల కేంద్రానికి చెందిన గ్రామ సేవకురాలు (వీఆర్ఏ) లక్ష్మిదేవి (55) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన లక్ష్మిదేవి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మనోహర్ రావు, వీఆర్ఓలు, వీఆర్ఏలు అక్కడికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు తక్షణ సాయం కింద రూ.25 వేలు అందించారు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు.

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం

చిప్పగిరి: మండలంలోని ఏరూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పాటించడం లేదు. దీంతో విద్యార్థులు పోషకాహారానికి దూరమవుతున్నారు. మంగళవారం మెనూ ప్రకారం పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు ఇవ్వాల్సి ఉండగా కిచిడి, నీళ్ల సాంబారు, ఉడికించిన గుడ్డుతో సరిపెట్టారు. దీనిపై ఎంఈఓ బాలనాయుడును వివరణ కోరగా ఘటనపై విచారణ జరిపి ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

దేవనకొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు వీరశేఖర్, సూరి, సంజన్న, అశోక్, శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న హంద్రీ నీవా పనులను పూర్తి చేసి రైతులకు సాగు నీటిని అందించాలన్నారు. నాయకులు యూసుఫ్‌బాషా, బజారి, ఓంకార్, అనిల్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



మద్దికెరలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు



హాలిగేరలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ



తెర్నెకల్‌లో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీడీఓ గౌరీదేవి, ప్రజాప్రతినిధులు

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి



ఎమ్మిగనూరు 18వ వార్డు సచివాలయంలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అర్హులై ఉండి వివిధ కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు లభించని వారికి 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 17, 18, 19, 20 వార్డుల సచివాలయాల్లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ అంజనేయులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు సంధ్యారాణి, పూజేశ్వరి, వార్డు ఇన్‌చార్జ్‌లు సోమేష్, బంగి శ్రీరాంతో కలిసి సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, డైరెక్టర్ రంగన్న, కౌన్సిలర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె, కున్నూరు గ్రామాల్లో తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హత ఉన్న దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1లో గ్రామ సర్పంచ్ తోట సావిత్రి ఆధ్వర్యంలో ఎంపీడీఓ దశరథ రామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు, అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు కుల, ఆదాయ, బర్త్, ఫ్యామిలీ తదితర సర్టిఫికెట్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో మంగళవారం ఈఓఆర్డీ నరసింహులు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.



నేమకల్లులో ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

సర్పంచ్ ఈరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి చేతులమీదుగా 450 మందికి పలు రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించారు.

మద్దికెర: స్థానిక సచివాలయం- 1 పరిధిలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధికారులు 728 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. సర్పంచ్ సుహాసిని, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామంలో తహసీల్దార్ మల్లికార్జున, సర్పంచ్ మంజమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అర్హులైన 350 మందికి ఉచితంగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఆస్పరి: మండలంలోని హాలిగేర గ్రామంలో మంగళవారం సర్పంచ్ లింగమ్మ, కైరుప్పల సర్పంచ్ తిమ్మక్క అధ్యక్షతన సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాలిగేరలో - 316, కైరుప్పలలో - 130 సర్టిఫికెట్లను తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ అందజేశారు.

హొలహర్వి: మండలంలోని విరుపాపురం గ్రామంలో తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంతోనీ ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు మంజూరు చేశారు.

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్‌లో ఎంపీడీఓ గౌరీదేవి బృందం, కప్పట్రాళ్ల గ్రామంలో తహసీల్దార్ బృందం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామస్తులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అక్కడికక్కడే మంజూరు చేశారు. సర్పంచ్ అరుణ్‌కుమార్, సచివాలయ కన్వీనర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య చేతులమీదుగా దరఖాస్తుదారులకు వివిధ ధ్రువీకరణపత్రాలు అందించారు. ఇప్పటివరకు మండలంలో 4,181 మంది ప్రజలు వివిధ ధ్రువ పత్రాల కోసం దరకాస్తు చేసుకోగా 3,920 మందికి సర్టిఫికెట్లు అందించినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ సంజన్న తదితరులు పాల్గొన్నారు.

జీడీపీ పనులు పూర్తిచేయండి



జీడీపీ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి జీడీపీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆనకట్ట ఎత్తు పెంచే పనులు, క్రస్ట్ గేట్ల మరమ్మతు పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. జీడీపీ ఆనకట్ట ఎత్తు పెంపునకు ప్రభుత్వం రూ.57.3 కోట్లు మంజూరు చేసిందని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆనకట్ట ఎత్తు పెరిగితే భూమి అవసరం ఉంటుందని జీడీపీ ఎగువ ప్రాంతంలో భూసేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. జీడీపీ పనులు పూర్తయితే మరో టీఎంసీల నీరు అదనంగా నిల్వ చేసుకోవచ్చునని తెలిపారు. దీంతో ప్రాజెక్టు సామర్థ్యం 5.5 టీఎంసీలకు చేరుతుందన్నారు. ఆదోని డివిజన్‌తో పాటు జిల్లాలో తాగు, సాగు నీటి సమస్య తీరుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 25 వేల ఎకరాల సాగుకు అదనంగా మరో 10 వేల ఎకరాల భూములకు నీరు అందించవచ్చునని తెలిపారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) ఆధ్వర్యంలో జీడీపీను పర్యటక కేంద్రంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గోనెగండ్లలో తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి, భూ సర్వే పనులను పకడ్బందీగా చేయాలన్నారు. డీఈ విజయ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, ఏఈ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

మద్దికెర: చిరువ్యాపారులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో 'జగనన్న తోడు' పథకం ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, వైకేపీ ఏపీఎం మధుబాబు అన్నారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో జగనన్న తోడు పథకానికి సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని చిరువ్యాపారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 303 మంది ఖాతాల్లో రూ.84187 వడ్డీ సొమ్ము జమ చేయడం జరిగిందన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రూ.10 వేలు రుణాన్ని సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందన్నారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు పొదుపు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కుంకనూరు గ్రామస్తులకు విరాళం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి

చిప్పగిరి: దేవనకొండ మండలంలోని కుంకనూరు గ్రామంలో నిర్మించనున్న సీతారాముల ఆలయ నిర్మాణానికి చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి రూ.25,000 విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను కలిసి విన్నవించగా విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు శంఖరయ్య, రంగన్న, నాయుడు, వెంకటప్ప తదితరులు ఉన్నారు.

విద్యతోనే అట్టడుగు వర్గాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎరుకల హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి రాజు

ఆలూరు: విద్యతోనే అట్టడుగు వర్గాల వారు ఆర్థిక, సామాజిక రంగాలలో రాణించందుకు అవకాశం కలుగుతుందని రాష్ట్ర ఎరుకల హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. ఆయన మంగళవారం హొళగుందలో ఎరుకుల కులస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కుల సాధనకు ఎరుకలు ఐకమత్యంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నగేష్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా చంద్ర, ఈసీగా 10 మందిని ఎంపిక చేసినట్లు ఆయన ప్రకటించారు.

సద్వినియోగం చేసుకోండి

హొలహర్వి: జగనన్నతోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ లింగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి సూచించారు. ఈ మేరకు మంగళవారం జగనన్న తోడు పథకం ద్వారా చిరువ్యాపారులకు సున్నా వడ్డీ సాయం జమైన సందర్భంగా స్థానిక సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాతుతూ.. చిరువ్యాపారస్తులు ఆర్థికంగా రాణించేలా ప్రభుత్వం జగనన్న తోడు పథకం ద్వారా సున్నా వడ్డీతో ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటోందన్నారు. వ్యాపారాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్సీపీ నాయకులు నిట్రవట్టి లక్ష్మన్న, ఏపీఎం శివయ్య, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

అదునులోనే విత్తనం వేసుకోవాలి

దేవనకొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రుతుపవనాల ఆలస్యం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా విత్తు ఆలస్యం అవుతోందని, రైతులు విత్తనాలు వేసేందుకు ఇంకా అదును ఉందని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 80 వేల ఎకరాల సాగుభూమిలో ఇప్పటివరకు 40 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు అయ్యాయని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నల్లరేగడి భూముల్లో ఆగస్టు మొదటివారం వరకు, ఎర్రనేల భూముల్లో జూలై చివరి వరకు పత్తి పంటను సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు దిగులు చెందకుండా విత్తుకు సిద్ధం కావాలని సూచించారు.

బైండోవర్ కేసు నమోదు

వెల్దుర్తి: మండల పరిధిలోని మల్లెపల్లెలో ఆస్తి కోసం పన్నాగం పన్ని వృద్ధులైన తల్లిదండ్రులను బలవంతంగా తీసుకెళ్లి రిజిస్టర్ చేయించుకునే ప్రయత్నంలో సోమవారం పోలీసులకు దొరికిపోయిన చిన్న కుమారుడు, అతని వెంట వచ్చిన వారిని సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి అన్ని కోణాల్లో విచారించారు. జీపు డ్రైవర్ మినహా చిన్న కుమారుడైన కోడుమూరులో నివాసముంటున్న చిన్న తిప్పరాజు, అతని వెంట వచ్చిన కోడుమూరుకు చెందిన చిన్న సుంకన్న, హనుమంతు, రాముడు, హనుమన్నలపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం స్థానిక తహసీల్దార్ రాజేశ్వరి ముందు హాజరుపరచగా పూచికత్తుపై వదిలేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వీరినుంచి వృద్ధ దంపతులకు ఎలాంటి సమస్య వచ్చినా తగు చర్యలు తీసుకుటామన్నారు.

20 నుంచి వీఆర్ఏల ఆందోళనలు

వెల్దుర్తి: తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 20 నుంచి దశలవారీ పోరాటం చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామ సేవకుల (వీఆర్ఏ) సంఘం మండలాధ్యక్షుడు అయ్యస్వామి, ఉపాధ్యక్షుడు ఉస్మాన్ బాష తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఆర్ఐ మస్తాన్‌కు అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 20, 21వ తేదీల్లో మండల కేంద్రాల్లో దీక్షలు, ఆగస్టు 7, 8వ తేదీలలో జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 25న జగనన్నకు చెబుదాం అంటూ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నిస్సహాయులపై కరుణ



బెంగళూరుకు వెళ్లి అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలు తిక్కమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రావణ్ రాజు

ఆలూరు మండలం ఎం.కొట్టాల గ్రామానికి చెందిన వృద్ధురాలు తిక్కమ్మ అనారోగ్యంతో గతేడాది జనవరి 10న ఆరోగ్య శ్రీ కింద బెంగళూరులో చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. మూడు నెలల పాటు చికిత్స పొందింది. అనంతరం వైద్యులు డిశ్చార్జ్ చేశారు. మరో వారం తర్వాత ఆస్పత్రికి రావాలని చెప్పారు. అంత దూరం వచ్చివెళ్లడానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డువచ్చాయి. బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే ఉంటోంది. మూడు నెలలు దాటింది. ఈ క్రమంలో బయోమెట్రిక్ వేస్తేనే పింఛన్ వస్తుందని గ్రామస్తులు, బంధువులు చెప్పారు. అనారోగ్యం వల్ల రాలేని పరిస్థితి. ఊర్లో ఉంటే ప్రతి నెలా పింఛన్ వచ్చేది అని బాధపడింది.ఈ స్థితిలో వలంటీర్ శ్రవణ్‌రాజు బెంగళూరుకు వెళ్లి ఆమె చేత బయోమెట్రిక్ నమోదు చేయించి మూడు నెలల పింఛన్ రూ.7,500 అందించి మానవత్వం చాటాడు. దీంతో ఆమె ఆనందానికి హద్దుల్లేవు. అనారోగ్యంతో బాధపడుతున్న అవ్వ పట్ల మానవత్వం చాటిన వలంటీర్ శ్రావణ్ రాజును గ్రామస్తులు మెచ్చుకున్నారు. - ఆలూరు రూరల్

చేతులెత్తి మొక్కినా..

నేను వెన్నుపూస, నడుం నొప్పితో బెంగళూరులో ఆస్పత్రిలో చేరాను. మూడు నెలలు ఆస్పత్రిలోనే ఉన్నాను. డిశ్చార్జ్ చేసి వారం రోజుల తర్వాత మళ్లీ రావాలని చెప్పారు. వచ్చిపోయేందుకు డబ్బులు లేక బంధువుల ఇంట్లో ఉన్నా. మూడు నెలల పింఛన్ పోయింది అనుకున్నాను. ఒకటో తేదీ సాయంత్రం మా వలంటీర్ శ్రావణ్ నేను ఉన్న చోటికే వచ్చి రూ.7,500 ఇచ్చాడు. పోయిందనుకున్న పింఛన్ తెచ్చి ఇవ్వడంతో వలంటీర్‌కు చేతులెత్తి మొక్కినాను.

- తిక్కమ్మ, ఎం.కొట్టాల గ్రామం

ఆపదలో ఆదుకున్నారు



కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అక్బర్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బాషా

ఆస్పరి మండలం బిలేకల్లుకు చెందిన నడిపి అక్బర్ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఆ కుటుంబం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. భార్య, కుమారుడు ఆస్పత్రిలో ఆయన వద్ద ఉంటూ బాగోగులు చూసుకుంటున్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమయంలో వలంటీర్ షేక్ బాషా కర్నూలుకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నడిపి అక్బర్‌కు పింఛన్ సొమ్ము అందజేశారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమయంలో కర్నూలుకు వచ్చి పింఛన్ సొమ్ము అందించడంపై వారు ఎంతగానో సంతోష పడ్డారు.

- ఆస్పరి



వలంటీర్ సహాయం మరువలేనిది

నేను అపదలో ఉన్న సమయంలో కర్నూలుకు వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాకు పింఛన్ డబ్బులు ఇవ్వడం ఎన్నటికీ మరవలేను. ఆ సమయంలో పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడ్డాయి. వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి ఆస్పత్రి వద్దకే పింఛన్ సొమ్ము పంపిన జగనన్నకు రుణపడి ఉంటా.

- నడిపి అక్బర్, బిల్లేకల్లు గ్రామం, ఆస్పరి మండలం

న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి



పత్తికొండలో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పత్తికొండటౌన్: రాబోయే పార్లమెంటు సమావేశాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును ఆమోదించి, తక్షణం అమల్లోకి తీసుకురావాలని బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బి.రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు మైరాముడు, సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్‌అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం పత్తికొండలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవనిగడ్డ బార్ అసోసియేషన్ న్యాయవాది శ్రీనివాసరావుపై కొందరు దాడిచేసి కొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో న్యాయవాదులపై దాడులు అధికం అయ్యాయన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలుచేయాలని డిమాండ్‌చేశారు. న్యాయవాదులు నాగేశ్, రవిప్రకాశ్, మహేశ్, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల్లో 'ఆత్మ' ఘోష

- ఐదేళ్లుగా తెరుచుకోని ఆత్మ భవనం
- ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగిస్తే తీరనున్న అసౌకర్యాలు



పత్తికొండలో ముళ్ల పొదల మధ్యన ఉన్న ఆత్మ కార్యాలయం భవనం

పత్తికొండ రూరల్: పత్తికొండలోని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) భవనం గత ఐదు సంవత్సరాలుగా తెరుచుకోక బూత్‌బంగ్లాగా మారింది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, పౌల్ట్రీ, మత్స్య, ఉద్యానవన అభివృద్ధి కోసం అప్పట్లో ఏర్పాటుచేసిన ఆత్మ ప్రాజెక్టు నిస్తేజంగా మారింది. ఆత్మ విభాగానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం కొరవడటంతో వార్షిక కార్యాచరణ, ప్రణాళికకు అనుగుణంగా రైతుల కోసం అధికారులు కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నారు. దీంతో ఐదేళ్ల కిందట మూతపడిన భవనం తలుపులు తెరుచుకోక చుట్టూ ముళ్లకంచెలు ఏపుగా పెరిగాయి. దీనికి తోడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆనుకుని అడ్డుగా బండలు పాతడంతో భవనం వైపు వెళ్లేందుకు కూడా వీలులేకుండాపోయింది. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ఉపయోగంలో లేక శిథిలమైపోతోంది. నిరుపయోగంగా మారిన భవనాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించేలా అధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు



యాటకల్లు సమీప పొలంలో ఉల్లి నాట్లు వేస్తున్న కూలీలు

ఆస్పరి: మండలంలో ఓ మోస్తరు వర్షాలు కురువడంతో రైతన్నలు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బోర్ల కింద ఉల్లి, మెట్ట పొలాల్లో టమాటా సాగు చేపట్టారు. వర్షాలు ఆలస్యంగా కురవడంతో కొందరు రైతులు పత్తి పంటకు బదులు టమాట సాగు చేస్తున్నారు. మండలంలో ఎక్కువ మంది రైతులు టమాటా సాగు చేపట్టడంతో ఆ మొక్కకు డిమాండ్ పెరిగింది. నర్సరీల్లో 50 పైసలకు దొరికే టామాట మొక్క ప్రస్తుతం రూ.2 వరకు పెరిగింది. అంత ధర పెట్టినా టమోటా మొక్కలు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 5 వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. కూలీల ఖర్చు కలుపుకుని ఎకరానికి రూ.15 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు.

బదిలీ వీఆర్వోలకు సన్మానం



బదిలీపై వెళుతున్న వీఆర్వోలను సన్మానిస్తున్న దృశ్యం

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగుల, రాంపల్లి సచివాలయాల వీఆర్వోలు రాజుకుమార్‌నాయక్, రేష్మ కర్నూలుకు బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని తహసీల్దార్ రవి, వీఆర్వోలు, సిబ్బంది పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రాతన వీఆర్వో నాగేంద్రను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డీటీ నిజాముద్దీన్, ఆర్ఐ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.